98

# చలి

వూరంతటినీ చలిగాలి చల్లగా కౌగిలించుకుని చాలాసేపైంది. అప్పుడు రాత్రి ఒంటి గంటయింది. వెన్నెల పచ్చని నైలాన్ శాలువలాగ రోడ్డు మీద పరుచుకుంది. వూరంతా చలిగాలి ఒడిలోపల ఒదిగి నిద్రపోతోంది. ఆ వెన్నెల చలిరాత్రిలో వూరంతా వణుకుతున్నా, అప్పుడే రెండో ఆట సినీమా చూసి, పైకి వచ్చినిలబడ్డ ప్రభాకరం మాత్రం ఏ మాత్రం వొణకటం లేదు. సినీమా హాల్లోంచి వచ్చిన జనం అంతా చలితోబాటు వెళ్ళిపోయేదాకా అతడలాగే నిలుచుని, వెన్నెలనీ, చలినీ చూసి చాలా ఆనందించేడు. అందుక్కారణం అతను ఆ వేళ వేసుకున్న తెల్లకోటు. ఆ కోటు పులెన్‌తోనో, ముఖ్‌మల్‌తోనో, లేక రెండింటి మిశ్రమంతోనో చేసిన దానిలాగ చాలా అందంగావుంది. ముత్యాల పోగుని ముచ్చటగా పేర్చినట్టు చాలా బావుందాకోటు. మంచుకొండని పూర్తిగా అధిరోహించి శిఖరపు సరిహద్దుపైన కూర్చుని, అతి ఆనందంతో అందుకున్న మంచు ముక్కలాగ చాలా మనోహరంగా వుందది. అలాగే మరో ఐదు నిమిషాలు నిలబడి, చాలా చల్లదనాన్ని కూడగట్టుకుని వచ్చినా ఏమీ చెయ్యలేని చలిని చూసి నవ్వుకుని, కాస్త దూరం లోనే వున్న ఖరీదైన హోటల్ వేపు నడిచేడతను.

* * *

ప్రభాకరానికి పందొమ్మిదేళ్ళున్నాయి. అతను బి. ఏ. ఆఖరి సంవత్సరం చదువుతున్నాడు. ఆవేళే తిరిగొచ్చిన వాళ్ళన్నయ్య సంప

త్సరం క్రితం స్కాలర్‌షిప్ మీద ఫారిన్ వెళ్ళకముందు, రెండు సంవత్సరాల క్రితం ప్రభాకరం వో ఇంగ్లీషు సినీమా చూసేడు. ఆ సినీమాలో గొప్పతనాన్ని అతను మెచ్చుకోవడమే కాక, ఆ సినీమా అంటటికీ హీరో వేసుకున్న తెల్లని కోటు చూసి చాలా అబ్బురపడ్డాడు. మైమరచి పోయేడు. అతని మనసునిండా ఆ కోటు రూపమే కమ్ముకుని ముత్యాల హారంలా పెనవేసుకుపోయింది. ఆ ఒక్క కోటు సీను కోసమే అతనా సినీమా మూడు సార్లు చూసేడు. నాలుగోసారి చూడలేక పోయినందుకు చాలా విచారించేడు. అతని జీవితంలో మరచిపోలేని స్మృతుల్లోఅదొకటి. "అలాటి కోటుంటేనో?" అనిపించిందతనికి. "వుంటే ఇంకేంకావాలి? స్వర్గం ఆ కోటులోకాక ఇంకెక్కడుంది?" అని కూడా వెంటనే అనిపించిందతనికి. ఆ కోటునతను చలిగాలిలో వెచ్చని తోడుగానూ, ప్రియాతి ప్రియమైన ప్రేయసిగానూ వూహించుకున్నాడు. ఆ కోరిక నతను హృదయంలో పదిలంగా దాచుకుని, ఆ కోటు లేనందుకు బాధపడుతున్నా — ఆ కోటు లేనితనమనే అసంతృప్తికి, నిత్యనూతనంగా తల్చుకొనే సినీమాలో పాతస్మృతిని పొరగా అడ్డువేసి తృప్తిపడేవాడు. అప్పుడప్పుడు కలల్లో ఆ కోటువేసుకుని, కాస్సేపు విహరించి కళ్ళు తెరచి నిట్టూర్చేవాడు.

అందమైన ప్రభాకరంలో, చాలా అందమైన ఆ కోరిక రెండేళ్ళు పెరిగేక, పగిలిన మబ్బులోంచి వెచ్చని వెన్నెల వెలిగినట్టు అదృష్టం వాళ్ళన్నయ్య స్కాలర్‌షిప్ రూపంలో వచ్చి పలకరించింది. వాళ్ళన్నయ్య ఫారిన్ వెడుతూ "నీకేం కావాలా" అని అడిగినప్పుడు అతనా కోటుని అరగంట వర్ణించి "ఆ కోటు — అచ్చు అలాటి కోటే కావాలన్నయ్యా!" అన్నాడు.. వాళ్ళన్నయ్య "తప్పకుండా్రనా! కానీ అంత చిన్న కోరికా?" అన్నాడు. అప్పుడు ప్రభాకరం "అంతే నన్నయ్యా! అమెరికా అంతటినీ తెచ్చినా నాకొద్దు. ఆ కోటే కావాలి. మర్చిపోకుసుమీ"అన్నాడు.

ఆ తరువాత సంవత్సరం పాటు అతను, భక్తాగ్రేసరులు దేవుడి కోసం తపస్సు చేసినట్టు ఆ కోటుకోసం తపస్సు చేసేడు. పన్నెండు నెలలపాటు ఆశా, ఆత్రుతా రెండు ముఖమల్ రెక్కలుగా మారి ఆ

కోటు రూపంతోబాటు అతని మనసులో పిసుపు లేకుండా విహరించేయి.

"అంత పెద్ద దేశం వెళ్ళిన అన్నయ్యకి ఇంత చిన్న, తమ్ముడి కోరిక జ్ఞాపకం వుంటుందో లేదో" నని ప్రభాకరం మొదట సందేహించాడు.

కాని, "నువ్వు బాగా చదవరా. నువ్వడిగింది తెస్తాలే!" అని వాళ్ళన్నయ్య మొదటి ఉత్తరంలో రాసింది మొదలు, ఆ ముందురోజు దాకా అతను ప్రతి రాత్రి పన్నెండు దాకా గదిలో బల్బుతో బాటు బోలెడు ఆశని కూడా వెలిగించుకొని చదివేడు. ఆ కోటు రూపం అతనిలోకి తెల్లని చక్కని ఉత్సాహాన్ని విపరీతంగా ఉత్పత్తి చేసింది.

ఆఖరికి ఆ వేళ అన్నయ్యొచ్చాడు. ప్రభాకరం కాలేజీ నుంచి యింటికి వెళ్ళేసరికి అన్నయ్య వున్నాడు. ఇదివరకన్నా అందంగా తయారయ్యేడు. అతను, ప్రభాకరాన్ని తన గదిలోకి తీసుకెళ్ళి, భుజం మీద తట్టి, తన పెట్లోంచి కోటు తీసి ఇచ్చినప్పుడు, ప్రభాకరం కళ్ళకి ఇంకా అందంగా- తపస్సు ఫలించిన తరువాత ప్రత్యక్షమైన దేవుడంత అందంగా- కనిపించాడు.

అంతకుముందు, ఓసారి ప్రభాకరం కోటుకోసం పడే ముచ్చట చూసి వాళ్ళింట్లో యాభై రూపాయలిచ్చి కోటు కొనుక్కోమన్నారు. అతను కొనబోయే కోటుగురించి ఆలోచిస్తూంటే వో స్నేహితుదొచ్చి, "ఒరేయ్ ప్రభా. పరీక్ష ఫీజు! ఆఖరిరోజు" అని యేడ్చేడు. జాలి గుండె ప్రభాకరం గుండెల్లో జాల పెరిగిపోయి, అతనికా డబ్బు ఇప్పించేసింది. ఆ తరువాత డబ్బు పోయిందని ఇంట్లో చెప్పి తిట్లు తిన్నాడతను. మరోసారి వాళ్ళ నాన్నగారే వో తెల్లని కోటు తెచ్చేరు. ఆ కోటు బాగానే వుందిగాని....అతని కోర్కె స్థాయికి దూరంగానేవుంది. అతనా కోటుతోనే తృప్తిపడదామని సిద్ధపడేసరికి దాన్ని చుట్టపుచూపు కొచ్చిన ప్రభాకరం మామయ్య కొడుకడిగేడు. ప్రభాకరం ఆలోచించి కాదనలేక నవ్వి యిచ్చేశాడు....అందువల్ల అతను ఇప్పటిదాకా వూహల్లో తప్ప, కోటు వేసుకోవడం జరగలేదు. ఆ కోర్కె విత్తనం అతని మనసులో మొలకెత్తి, పెరిగి మహా వృక్షంగా మారిపోయింది.

కాని, చిన్న చిన్న గ్రామాలు పోయినా మహా సామ్రాజ్యాన్నే ఒక్కసారి జయించినట్టు అవకాశాలు రెండు మూడు పోయినా, అమెరికా నుండి అన్నయ్య తెచ్చిన అతి అందమైన కోటు అతనిదైంది. అన్నయ్య చాలా మంచివాడు....చెల్లికి రిస్టువాచీ తెచ్చాడు. అమ్మకి దంతపు నగిషీ పెట్టె తెచ్చాడు. నాన్నగారికి చక్కని చేతికర్ర తెచ్చాడు. అందరికీ సంవత్సరంపాటు పెరిగిన ఆప్యాయత తెచ్చేడు. తనకి తనడిగిన కోటుతోబాటు ఎంతో సంతోషాన్ని తెచ్చేడు. అంతే కాక సినీమాకి వెళ్ళమని పదిరూపాయలిచ్చేడు. ఆ రాత్రి అమ్మచేసిన స్వీట్లతో బాటు హాయిగా భోంచేసి, చలిగాలిలో, ఇంట్లో వద్దంటున్నాసరే ఆ కోటు వేసుకొని ప్రపంచాన్నంతటినీ జయించినంతగర్వంతో సినీమాకి బయల్దేరేడు ప్రభాకరం. చలి హెచ్చుగా చల్లగా వున్నాసరే, అతనికి వెచ్చగా హాయిగా వుంది. పచ్చని వెన్నెల ఆ తెల్లని కోటుమీదపడి చల్లగా విరిసింది.

* * *

ప్రభాకరం మనసులో పట్టని సంతోషం ఒలికిపోయి ప్రపంచమంతా పాకిపోయింది. సినిమాహాల్లో అందరూ ఆ కోటుపక్కే చూసేరు. ఆ తరువాతకూడా అతనెప్పుడు వేసుకున్నా ఆ కోటు పక్కే చూడక మానరు. "ఇది నా జీవితానికి వెలుగు. నాపాలిట వజ్రాలవరం. ఎముకలు కొరికే ఈ చలిలో ఇది నాకెంతో చక్కని వెచ్చని ప్రేయసి. నా ప్రాణం పోయినా ఈ కోటు వదలను." అనుకున్నాడు ప్రభాకరం. అలా అనుకుని కాఫీ తాగి బైటకివచ్చి హాయిగా, సంతృప్తిగా నడవడం ప్రారంభించేడు.

అతను చల్లని చలిలో నెమ్మదిగా నడుస్తూ రాబోయే ఫంక్షన్ గురించీ, తను వేయబోయే నాటకం గురించీ ఆలోచించేడు.

"ఈ కోటువేసుకుని యాక్టుచేస్తే అందరూ అసూయతో పడిచస్తారు. అమ్మాయిలు ప్రేమలో పడిచస్తారు. జడ్జీలు గుమ్మైపోయి తనకే ప్రైజిస్తారు. ఫంక్షన్‌లో తనీ కోటువేసుకొని స్టేజెక్కి ప్రైజు తీసుకుంటాడు. మర్నాడే తను ప్రేమిస్తున్నా, తననింకా ప్రేమించని అరుణ వచ్చి తనని ప్రేమించకపోతే, "కోటుమీద వొట్టు" అంటుంది...."

పెరిగిపోతున్న మల్లెపందిరిలాంటి కోటు వునికి నీడల్లో, ప్రతీ ఆలోచనా అందంగా విశ్రమిస్తోంది.

వెచ్చదనంలేని వెన్నెల చలితోబాటు కలిసి చల్లగా కాస్తోంది. కుబేరుడికి కోపంవచ్చి విసిరేసిన ముత్యాల్లాగా ఆకాశంలో నక్షత్రాలు మెరుస్తున్నాయి. చలి, మంచివాడి మనసంత చల్లగా వీస్తూ, శత్రువుల పగంత జోరుగా కమ్మేస్తోంది.

ప్రభాకరం మెయిన్రోడ్డు లోంచి టర్నింగు తిరిగేడు. ఓనాలుగైదడుగులు నడిచేడు. వాళ్ళిల్లు ఇంకా రెండు సందులు, మూడు ఫర్లాంగులు వుంటుంది. ఇంతలోనే ఆ చలిగాలిలోంచి అస్పష్టంగా, "బాబూ!" అన్న పిలుపు వొణుకుతూ వచ్చి అతని చెవిలో పడింది.

ప్రభాకరం ఆగిపోయాడు. వెనక్కి చూసేడు. అతనికి నాలుగైదడుగుల దూరములో మ్యునిసిపల్ కాలువ పక్కన, ఓ ముష్టివాడు పడున్నాడు. అనుకోకుండానే ప్రభాకరం అటు నడిచేడు.

ఎందుకోగాని, ఆ వేళ మ్యునిసిపల్ దీపం వెలిగే వుంది. చాలీచాలని దీపపుకాంతి వెన్నెలతోబాటు అతనిమీద పడుతోంది.

అతని వయసు ఎంతో సరిగా చెప్పడం కష్టం. అతని జుత్తు సగం పండిపోయింది. చాలా కాలం నించీ నూనె నెరక్కపోవడంవల్ల అది పెను చలిగాలికి కూలిపోయిన చెట్టు మొదలులా వుంది. అతని కళ్ళు ఎన్నాళ్ళక్రితమో వెలుగుని మర్చిపోయి, చావుకోసం - ఒక్క చావు కోసంమాత్రమే ఎదురుచూస్తున్నట్టున్నాయి. అతను ఎన్నో వందల ఏళ్ళ క్రితం, తను జీవితం కంటే ఎక్కువగా ప్రేమించిన వ్యక్తి మరణవార్త విని, విచారంలో లీనమైపోయి, ఇంకా కొంచెంకూడా తేరుకోని వాడిలా వున్నాడు.

చిరుగులే బట్టకన్న చాలా ఎక్కువగా వుండి అతని వొంటిమీద వుండలేక చలికి అదిరిపోతున్న చొక్కా, ఎప్పుడో రైలుకింద బుర్ర పెట్టేసిన వాళ్ళ నాన్నదై వుంటుంది. అతని మోకాళ్ళదాకా వున్న చిరుగుల పంట్లాం, చేతికి ఎదిగివచ్చి, కష్టాల్నీ, ఇంట్లో దరిద్రాన్నీ భరించలేక పారిపోయిన అతని పెద్దకొడుకుదై వుంటుంది. అతనిముందున్న దొక్కు

అతనిదే ఐవుంటుంది. ఎన్నో రోజులనుంచీ అన్నం ఎలా వుంటుందో చూడకపోయినా, అతనింకా ఆ ఘోరమైన చలిలో, రాలిపోడానికి సిద్ధంగా వున్న ఎండుటాకులా వణుకుతూ బతికే వున్నాడంటే ఆ గొప్పతనం దేవుడిదై వుంటుంది. ఇలా, కష్టాలని తప్ప మరి వేటినీ ఎరుగక, దరిద్రం, నిరాశ తప్ప మరేవీ తెలియక, ఎందుకు బతుకుతున్నాడో జవాబు తెలిసి కోలేక, పగలూ రాత్రీ తన మీద ధూళిని వదిలేసి పోతున్న కారుల్ని చూస్తూ, అందని సుఖాలని చూడలేక చూస్తూ, నిప్పుల గుంపులాటి ఎండల్నీ, బాణాల్లాటి వర్షాలనీ, ఇప్పుడు త్రాచుపాము కాటుల్లాటి కటిక చలిని అనుభవిస్తున్న అతను ఇంకా ఇలా బతికే వున్నాడు. ఆ తప్పూ దేవుడిదే ఐ వుంటుంది.

అతను ఆ పెను చలిగాలికి విపరీతంగా, ఆ వూరి జమీందారుగారు ఫేనుముందు నిలబడి లెక్కపెడుతున్న వంద రూపాయల కాగితాల్లాగ వణికిపోతున్నాడు. పెనుపులి నోటికి చిక్కిన చిలకలాగ అతనా భయం కరమైన చలిలో వొదిగిపోతూ కదిలిపోతున్నాడు.

అతన్ని చూడగానే ప్రభాకరం మనసు అదోలా అయిపోయింది. అతని గుండెల్లో ఏదో మాటల కందని భావం మసగ్గా మెదిలి, మరు నిముషంలోనే మనసునంతటిని కమ్మేసింది. అతనొక్కసారిగా తన పుత్సాహాన్నంతటినీ మరిచిపోయేడు. కోటు వేసుకున్నాక, అతను మహా రాజైనట్టు ఫీలయేడు. కాని ఇప్పుడలా లేదు. తను మహారాజైన తరవాత సామ్రాజ్యంలోని ప్రజలందరూ చచ్చిపోయి, రాజ్యమంతా శ్మశానంగా మారిపోయినట్టయింది.

"అతనికీ పెళ్ళాం పిల్లలూ వుండి వుంటారు. వాళ్ళ కళ్ళలోనూ నిరాశ నిర్నిమేషంగా మెదులుతూవుండి వుంటుంది. వాళ్ళు బహుశా, మరొక్క రోజు తిండిలేకపోతే చచ్చిపోయేందుకు సిద్ధంగా వుండి వుంటారు." వాళ్ళున్నా లేకపోయినా అతన్ని చూస్తుంటే ప్రపంచాన్ని మరిచిపోయేడు. అతనికి అనుకోకుండానే దుఃఖం వెల్లువలా పొంగి వచ్చింది. ఎన్నో ఆలోచనలు అతని మనసులో పరమ వేగంగా పరిభ్ర

మించేయి. అతను జేబులోంచి పావలా కాసు తీసి చేతితో పట్టుకుని, మరొక్కసారి వంగి ఆ ముష్టివాడి కళ్ళలోకి చూసేడు.

చలిగాలి చాలా జోరుగావేస్తోంది. ఆపెనుచలిగాలికి అతను మంచు ముక్కలు మీదకి వేస్తున్నట్టు భయపడిపోతున్నాడు. విపరీతంగా బలంలేని చెట్టు ఆకు భయంకరమైన సుడిగాలికి వణుకుతున్నట్టు, వొణికిపోతున్నాడు. ఏదో చెపుదామని చెప్పలేకపోతున్నాడు. ఏదో చెయ్యాలని చెయ్యలేకపోతున్నాడు. ఆ చల్లని పెనుచలిలో అతను అప్పుడే పరీక్ష పాసైన పదహారేళ్ళ కొడుకు- ఒక్కడే కొడుకు- చచ్చిపోతే, ఆదుఃఖాన్ని భరించలేని అమ్మ పెదపుల్లాగి వొణుకుతున్నాడు.

అప్పుడతని కళ్ళలోకి చూసిన ప్రభాకరం మనసులో పెద్ద దృశ్యం మెదిలింది. ఎన్నో వేలమంది ఆర్తనాదాల నణచుకొంటూ చలికి వణికిపోతూ, ఆకల్ని అణచుకోలేక బాధల్ని భరించకలేక వరదాల్లాటి కన్నీళ్ళతో ఏమీతోచకఅలమటించిపోతున్నారు. వాళ్ళందరూ అస్తిపంజరాల్లావున్నారు. జీవంలేని కళ్ళతోనూ, జీవితాలతోనూ, వాళ్ళంతా శవాల్లాగున్నారు.

"మరి వీళ్ళందరి గతీ ఏం కావాలి?" అని అతని మనసు పెద్దకేక పెట్టింది.

ఆ తరువాత ఆ కళ్ళలోంచి ప్రభాకరం మనసులోకి ఏ మానవత్వపు కిరణాలు ప్రసరించి కమ్ముకున్నాయో, ఏ త్యాగపు విత్తనాలు మొలకెత్తి మహావృక్షాలుగా విస్తరించి, ఏ దేవత్వపు పూవుల్ని పూసేయో, ఏ గుండెల్లో నిద్రపోతున్న కరుణరసపు కమ్మని కలలు మేల్కొని యదార్థ దృశ్యాలుగా మారేయో కాని, అతని మనసులో ఓచక్కని తెల్లని మెరుపు మెరిసింది.

అప్పుడు ప్రభాకరం చేతిలోని పావలాకాసుని తిరిగి కోటుజేబులోనే పడేశాడు. ఆ తరవాత అతను తన ప్రియాతిప్రియంగా ప్రాణంతో సమానంగా ప్రేమించిన తెల్లని, మాయని కోటు విప్పేడు. విప్పి కాగితంలా వణుకుతూ చిరిగి ఎగిరిపోతాడేమోననిపించే ఆ ముష్టివాడి మీద కప్పేడతను. కప్పి ఓ ఐదు నిమిషాలపాటు అతని కళ్ళపక్కే చూస్తూ వుండిపోయేడు.

ఆ కళ్ళలో వెలిగిన భావాల భాషని ప్రభాకరం మనసు చదివింది. ఆ కళ్ళలోని వెయ్యిదీపాల వెలుగుని అతని మనసు చూడగలిగింది. ఆ కళ్ళలో కదిలిన కమ్మని సంతృప్తిని, అతని మనసు కడలి పొంగు లాటి సంతోషంతో కౌగలించుకుంది.

మరి కాస్సేపటికి ఆ కళ్ళలోంచి మానవత్వపు మకరందాన్ని గుర్తుకు తెస్తూ కదలిన కన్నీళ్ళలో అతనికి మనిషి జీవితంలో పరమార్థం కనిపించింది.

వణకడం మానేసినా, ఏమీ మాట్లాడలేని అతని పక్క ఆఖరిసారి చూసి, అతని భుజంమీద తట్టి, వెనక్కి తిరిగి నడవడం ప్రారంభించేడు ప్రభాకరం.

లోకాన్నంతటినీ మంచులో ముంచినట్టు చాలా చల్లగావుంది. చలి గాలి వెర్రెత్తినట్టు విపరీతంగా వేస్తోంది.

ఐనా ప్రభాకరానికి చలి వేయడంలేదు.

చలిలోకూడా ఎంతో హాయి, చాలా ఏళ్ళతరువాత కలుసుకున్న అమ్మ చేత్తో ఇచ్చిన వెచ్చని పాలు తాగి, అమ్మ గుండెల్లో తలదాచుకుని పడుక్కున్నట్టు చాలాహాయిగానూ, వెచ్చగానూ వుందతనికి. అంత చలి లోనూ అతనికి చక్కని వెచ్చదనం తోచింది.

అతని తెల్లని చొక్కా చలితో ఆడుకుంటూ ఎగురుతోంది. చలితో బాటు కలిసిన వెన్నెల, అతని మీదపడి అందంగా మెరిసింది.